ఆఖరి మజిలీకి అవస్థలు

- రాజాంను వేధిస్తోన్న శ్మశానవాటిక సమస్య
- కొన్ని కాలనీలకు పూర్తిగా లేని వైనం
- ఉన్నవాటిలో చాలా అస్తవ్యస్తం
- కబ్జా కోరల్లో శ్మశానాల మార్గం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ముళ్లపొదలు, డొంకలతో అస్తవ్యస్తంగా పొనుగుటివలసలోని శ్మశానవాటిక

రాజాం సిటీ: మున్సిపాలిటీలోని ప్రజలకు శ్మశాన వాటిక అవస్థలు తప్పడం లేదు. కొన్ని కాలనీలకు పూర్తిగా శ్మశానవాటిక సౌకర్యం లేకపోగా, ఉన్నవాటిలో చాలా శ్మశానవాటికలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఏ శ్మశానం చూసినా డొంకలు, ముళ్లకంపలు, పొదలతో నిండి ఉన్నాయి. కనీసం పాడె ఎత్తుకుని వెళ్లేందుకు వీలుగా మార్గం(దారి/రోడ్డు) కూడా లేకపోవడంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంత్యక్రియలు చేయాలంటే తల ప్రాణం తోకకు వస్తోందని అంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 17 వరకు శ్మశాన వాటికలు ఉండగా, వాటిలో చాలా వాటికి రోడ్డు, ప్రహరీ వంటి సౌకర్యాలు లేకపోవడంతో ఆక్రమణకు గురవుతున్నాయని స్థానికుల ప్రధాన ఆరోపణ.

కుచించుకుపోతున్న శ్మశానాలు..

రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పలు శ్మశానాలు కుచించుకుపోతున్నాయి. ఒకప్పుడు విశాలంగా ఉన్న శ్మశానాలు ప్రస్తుతం రెండు మృతదేహాలు ఒకేసారి దహనం చేసేందుకు కూడా వీల్లేని పరిస్థితి నెలకొంది. పట్టణం అభివృద్ధి చెందడంతో శ్మశాన స్థలాలు సైతం ఆక్రమణకు గురవుతున్నాయి. శ్మశానాలన్నీ పంటపొలాల పక్కనే ఉండడంతో ఏడాదికేడాది ఆక్రమణకు గురై, కొద్దికొద్దిగా కుచించుకుపోవడంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి, హద్దులు ఏర్పాటు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని పొనుగుటివలస, మెంటిపేట, వస్త్రపురికాలనీ, గాయత్రికాలనీ, తెలగ వీధి తదితర ప్రాంతాల వాసులు వాపోతున్నారు.

అంతంతమాత్రంగా రోడ్డు సౌకర్యం..

మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస, మెంటిపేట, గాయత్రికాలనీ, వస్త్రపురికాలనీ, డోలపేట, బుచ్చెంపేట, సారధి గ్రామాల్లోని శ్మశానవాటికలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం వస్తే ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మృతదేహాన్ని ముడుకుల లోతు బురదలో తీసుకువెళ్లాల్సిన దుస్థితి నెలకొంటోంది. కొన్నిచోట్ల రోడ్లు సైతం ఆక్రమణకు గురవడంతో మనిషి వెళ్లేందుకు కూడా వీల్లేని దుస్థితి. దారి పొడవునా జంగిల్స్ కూడా పేరుకుపోయి, మరోవైపు దారులు కూడా కుచించుకుపోయి పరిస్థితి దయనీయంగా మారింది. శ్మశానాలు బాగుచేసేందుకు ఇదే సరైన సమయమని, అధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇతర ప్రాంతాలకు మృతదేహాల తరలింపు..

పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో అంతంతమాత్రంగా శ్మశానాలు ఉన్నా వాటి వద్దకే మిగతా ప్రాంతాల వాసులు కూడా అంత్యక్రియల నిమిత్తం మృతదేహాలు తరలించాల్సిన పరిస్థితి నెలకొంది. మారుతీనగర్, ఈశ్వరనారాయణకాలనీ, వాసవీనగర్, ప్రశాంతినగర్, మొండివీధి, మల్లికార్జునకాలనీలతో పాటు ఇతర వీధుల్లో ఎవరు మరణించినా మేదరవీధి వద్ద ఉన్న జీఎంఆర్ శ్మశానవాటికనే ఆశ్రయిస్తుంటారు. దూరమైనా తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లక తప్పడంలేదని ఆయా కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి, శ్మశానవాటికలు లేని కాలనీలకు శ్మశానవాటికలు నిర్మించాలని కోరుతున్నారు.

రోడ్డు వేయాలి..



పొనుగుటివలస శ్మశాన వాటికకు వెళ్లే దారిలో పిచ్చిమొక్కలు పేరుకుపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నాం. దారి పొడవునా ముళ్లపొదలు ఉండడంతో శవాన్ని తీసుకువెళ్లిన సమయంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి, శ్మశానానికి వెళ్లేందుకు సీసీ రోడ్డు వేయడంతో పాటు శ్మశానం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాలి.

–ఆర్.శ్రీనివాసరావు, గ్రామస్తుడు, పొనుగుటివలస

ప్రతిపాదనలు తయారు చేశాం..



మున్సిపాలిటీలోని శ్మశానాలకు సంబంధించి, ఇప్పటికే ప్రతిపాదనలు తయారుచేశాం. ప్రస్తుతం శ్మశానాల అభివృద్ధికి ఎటువంటి నిధులు లేవు. నిధులు వచ్చిన వెంటనే రోడ్లతో పాటు శ్మశానాలకు ప్రహరీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.–జె.రామప్పలనాయుడు, కమిషనర్, రాజాం మున్సిపాలిటీ

క్లుప్తంగా

నవదుర్గమ్మ ఆలయ ఆదాయం రూ.1.31 లక్షలు



హుండీల్లోని కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గమ్మ ఆలయ హుండీల కానుకల గురువారం లెక్కించారు. ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు సమక్షంలో హుండీలు తెరిచి, లెక్కింపు చేపట్టగా, 85 రోజులకు గాను రూ.1,31,457లు సమకూరిందని ఈవో పి.శ్యామలరావు తెలిపారు. కార్యక్రమంలో బీవీ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నశిర్లాంలో గ్రామసభ



సభకు హాజరైన గ్రామస్తులు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీలకు సంబంధించి, గురువారం గ్రామసభ నిర్వహించారు. డీఆర్పీ ఎం.సూరిబాబు.. గ్రామంలో జరిగిన ఉపాధి పనుల వివరాలు చదివి వినిపించారు. అనంతరం పలువురు నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, సర్పంచ్ టంకాల ఉమాపాపినాయుడు, ఏపీవో ఎస్.హరనాథ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ సీసీ ప్లాట్‌ఫాం ప్రారంభం



సీసీ ప్లాట్‌ఫాం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం: మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ వద్ద రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ ప్లాట్‌ఫాంను ఎమ్మెల్యే బేబీనాయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.28 కోట్ల ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, ఎంపీటీసీలు వసంతల తిరుపతిరావు, బవిరెడ్డి చంద్ర, ఎంపీడీవో రత్నం, తహసీల్దారు సులోచనరాణి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ తహసీన

రాజాం: మండలంలోని కంచరాం, కొత్తకంచరాం గ్రామాల్లో క్షయవ్యాధి నిర్మూలనపై గురువారం అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న కార్యక్రమాలను క్షయవ్యాధి నిర్మూలన విభాగం రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ తహసీన పరిశీలించి, పలు సూచనలు చేశారు. క్షయవ్యాధిని ఆరంభంలో పసిగడితే వెంటనే నయం చేయవచ్చని తెలిపారు. సాధారణ జలుబు, దగ్గు మాదిరిగా ఉండే ఈ వ్యాధిని పట్టించుకోకుండా వదిలేస్తే ప్రాణాంతకంగా మారుతుందన్నారు. దగ్గు అధికంగా ఉండి, కెల్లలు పడుతున్న వ్యాధిగ్రస్తులు దగ్గరలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి కెల్ల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సిద్ధేశ్వరి, డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పథకాలను పరిశుభ్రంగా ఉంచాలి



రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో సత్యనారాయణ

మెంటాడ: రక్షిత మంచినీటి పథకాలతో పాటు తాగునీరు సరఫరా చేసే పైపులైన్ల ప్రాంతాలు, వాటి చుట్టుపక్కల ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలని జెడ్పీ సీఈవో సత్యనారాయణ సూచించారు. గురువారం మండలంలోని చాకివలస, పిట్టాడ, జీటీపేటల వద్ద సమగ్ర రక్షిత మంచినీటి పథకాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. తాగునీరు సరఫరా చేసే ప్రాంతాలు, తాగునీటి ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ ఎప్పటికప్పుడు చేపట్టాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో భానుమూర్తి తదితరులు ఉన్నారు.

శతశాతం అక్షరాస్యతే లక్ష్యం



మెంటాడ: విద్య ఆవశ్యకతను వివరిస్తున్న వయోజన విద్య డీడీ సోమేశ్వరరావు



తెర్లాంలో జరిగిన ఉల్లాస్ శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉమాలక్ష్మి



వంగర: శిక్షణా తరగతులకు హాజరైన వలంటీర్లు



రాజాంలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమ వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు

శతశాతం అక్షరాస్యతే లక్ష్యంగా మండల కేంద్రాల్లోని వెలుగు, ఎంపీడీవో కార్యాలయాల్లో ఉల్లాస్ కార్యక్రమంపై వలంటీర్లకు ఒక్కరోజు శిక్షణా తరగతులు గురువారం నిర్వహించారు. గ్రామాల్లోని మహిళలందరినీ అక్షరాస్యులుగా చేయాలని, ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో నిరక్షరాస్యులు లేకుండా చూడాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. చదువు లేకపోతే కలిగే అనర్థాలను వివరించాలని తెలిపారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్

మోడల్ ప్రశ్నపత్రాల విడుదల

బొబ్బిలి: మండల కేంద్రంలోని విద్యాశాఖాధికారి కార్యాలయంలో డెల్టా(ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం) పరీక్ష(ఇంగ్లిష్ సామర్థ్య పరీక్ష) మోడల్ ప్రశ్నపత్రాలను డిప్యూటీ ఈవో కె.మోహనరావు, ఎంఈవోలు చల్ల లక్ష్మణరావు, గొట్టాపు వాసు కలిసి గురువారం విడుదల చేశారు. డెల్టా ఆధ్వర్యంలో ఏటా ఇంగ్లిష్ భాష సామర్థ్య పరీక్ష నిర్వహించడం జరుగుతోందని, ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన పరీక్ష నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

పశువైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి



తెర్లాం: నందిగాంలో ఆవు చూడి పరిశీలిస్తున్న మండల పశువైద్యాధికారి నరేంద్రకుమార్



రాజాం: గురవాంలో పశువైద్య శిబిరం వద్ద మందుల ప్రదర్శన, వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

గ్రామగ్రామాన ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. గురువారం పలు గ్రామాల్లోని శిబిరాల్లో పశువులు సహా గొర్రెలు, మేకలు, కోళ్లు వంటి మూగజీవాలకు వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేపట్టి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తగా టీకాలు, మందులు వేశారు. వ్యాధి లక్షణాలతో మూగజీవాలు బాధపడితే వైద్యులను సంప్రదించి, సలహాలు, సూచనలు పొందాలని వైద్యాధికారులు సూచించారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్

నేతాజీ ఆశయ సాధనకు కృషి చేయాలి



రాజాం సిటీ: నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు



తెర్లాం శాఖా గ్రంథాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

రాజాం సిటీ: నేటి యువతరం అంతా నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు కృషి చేయాలని రెడ్‌క్రాస్ రాజాం అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ కోరారు. స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయంలో నేతాజీ 128వ జయంతి గురువారం నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. అణువణువునా దేశభక్తి కలిగి అపారమైన ధైర్యసాహసాలతో బ్రిటిషర్ల వెన్నులో వణుకు పుట్టించిన మహానుభావుడు సుభాష్ చంద్రబోస్ అని అన్నారు. సర్వమత సామరస్యంతో కూడిన దేశ సమైక్యతను ఆయన కోరుకున్నారని, ఆ దిశగా భారత సమాజం కూడా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్యకుమార్, బూరాడ శివకృష్ణ, నీలకంఠేశ్వరయాదవ్, గట్టి పాపారావు, ఎస్.తారకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: శాఖా గ్రంథాలయంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి గురువారం నిర్వహించారు. లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి తదితరులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన ఆజాద్ హిందూ ఫౌజ్ సంస్థ ద్వారా సాధించిన విజయాలను లైబ్రేరియన్ వివరించారు.

వంగర: స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాలతో పాటు మండలంలోని తలగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి గురువారం నిర్వహించి, నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

సదరం ధ్రువీకరణ పత్రాల పరిశీలన



దివ్యాంగుల లోపాలను తనిఖీ చేస్తున్న వైద్యుడు

రాజాం: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో దివ్యాంగులకు ఆరోగ్య తనిఖీలతో పాటు సదరం ధ్రువీకరణ పత్రాలను వైద్యులు గురువారం పరిశీలించారు. రెండు బృందాలుగా ఏర్పడిన వైద్యులు పింఛన్ పొందుతున్న దివ్యాంగుల అర్హత పత్రాలను క్షుణ్నంగా చూసి, వారి అర్హులా కాదా అనే విషయాన్ని నిర్ధారిస్తున్నారు. రాజాం నియోజకవర్గంలో 6 వేలకు పైగా వివిధ కేటగిరీలకు చెందిన పింఛన్‌దారులు ఉండగా, వాటిలో 5012 పింఛన్ దారులకు సంబంధించి ధ్రువపత్రాల రీ వెరిఫికేషన్ రాజాం ఏరియా ఆస్పత్రిలో జూన్ వరకు జరుగుతుందని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎస్.జోసెఫ్ తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీ చిరంజీవి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలి



బాడంగి: రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత సూచించారు. మండలంలోని వండానపేట, కేఎంవలస, ఉంగరాడమెట్ట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె గురువారం సందర్శించి, అక్కడి సిబ్బంది పనితీరు, రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారం పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. బరువు తక్కువున్న చిన్నారులు, రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని సిబ్బందికి ఆమె తెలిపారు.

బాడంగి: మండలంలోని గజరాయునివలస అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్‌జేడీ జి.చిన్మయిదేవి.. గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది పనితీరు, ప్రీస్కూల్ పిల్లలకు చదువు చెప్పే విధానాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనభ్యసించాలని, రికార్డులను పక్కాగా నిర్వహించాలని తెలిపారు. ఆమె వెంట ఐసీడీఎస్ పీవోలు రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

సంతకవిటి: పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలని సీఈవో కడగల రమణ ఓ ప్రకటనలో గురువారం సూచించారు. ఫిబ్రవరి నెలాఖరులోగా ఏడు శాతం వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని లేకపోతే 13 శాతం అపరాధ రుసుం(వడ్డీ)తో అసలు కూడా కట్టాల్సి ఉంటుందన్నారు. రెన్యువల్‌కు ఆధార్‌కార్డు, 1–బి, ఫోన్ నంబరుతో సంతకవిటి కో–ఆపరేటివ్ సొసైటీని సంప్రదించాలన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయరూ..



రామభద్రపురంలోని జాతీయ రహదారిలో పలు జంక్షన్లు డేంజర్ జోన్లుగా మారాయి. ఇప్పటికే ఆయా జంక్షన్ల వద్ద పలు ప్రమాదాలు జరిగి, కొంతమంది మృత్యువాత పడగా, మరికొంతమంది తీవ్రగాయాలపాలై మంచానికే పరిమితమయ్యారు. ఇదంతా ప్రమాదకరంగా ఉన్న ఆ జంక్షన్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడమేనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వాహనాల రద్దీ, ప్రజల రాకపోకలు అధికంగా ఉండే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆర్టీసీ కాంప్లెక్స్ మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–రామభద్రపురం

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తిరగని ఫ్యాన్లు



రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఫ్యాన్లు తిరగడం లేదు. దీంతో బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులు ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కొత్తగా నిర్మించిన ఈ బస్టాండ్‌లో అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేవని, ప్రస్తుతం కూటమి సర్కారు పాలనలో కనీసం ఫ్యాన్లు కూడా పనిచేయడం లేదని పలువురు ప్రయాణికులు విమర్శిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కాంప్లెక్స్‌లో మౌలిక వసతుల అభివృద్ధి కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు.

–రాజాం

పక్కా భవనాలు నిర్మించాలి



రాజాంలోని బీసీ బాలురు వసతిగృహానికి సంబంధించి, పక్కా భవనాలు నిర్మించాలని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సాయికిరణ్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ఆ వసతిగృహం వద్ద గురువారం విలేకరులతో మాట్లాడారు. 120 మందికి పైగా విద్యార్థులు ఉంటున్న వసతిగృహానికి ఇప్పటివరకు సొంత భవనం లేకపోవడం దారుణమన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని, సొంత భవనం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట వెంకటరమణ పట్నాయక్ తదితరులు ఉన్నారు.

–రాజాం సిటీ

ఉపాధ్యాయుల ధర్నా



బొబ్బిలి మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు గురువారం ధర్నా చేపట్టారు. స్కూల్ కాంప్లెక్స్ పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా విద్యాశాఖ తీసుకుంటున్న నిర్ణయాలు అసంబద్ధమైనవని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వి.ప్రసన్నకుమార్ విమర్శించారు. పొట్టిశ్రీరాములు ఉన్నత పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్‌గా కొనసాగించాలని, మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలన్నింటినీ మున్సిపల్ హైస్కూల్‌తోనే మ్యాపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ స్కూల్స్ పట్ల ఎంఈవోల వైఖరి మారాలన్నారు.

–బొబ్బిలి

రెవెన్యూ సదస్సులకు వచ్చిన సమస్యలు పరిష్కరించండి

- బొబ్బిలి నియోజకవర్గ రెవెన్యూ సదస్సుల ప్రత్యేకాధికారి నూకరాజు



తెర్లాం: సమస్యల పరిష్కారంపై ఆరాతీస్తున్న బొబ్బిలి నియోజకవర్గ రెవెన్యూ సదస్సుల ప్రత్యేకాధికారి నూకరాజు

తెర్లాం: రెవెన్యూ సదస్సుల్లో రైతులు లేవనెత్తిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి, బొబ్బిలి నియోజకవర్గ రెవెన్యూ సదస్సుల ప్రత్యేకాధికారి నూకరాజు ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన గురువారం సందర్శించి, రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యల్లో ఎన్ని పరిష్కరించారో తహసీల్దారు జి.హేమంత్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల నుంచి 293 వినతిపత్రాలు వచ్చాయని, వాటిలో ఇంతవరకు 138 వినతులను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. మిగిలిన వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని తెలియజేశారు. ఆయన వెంట ఉప తహసీల్దారు గొంగాడ సత్యనారాయణ, ఆర్ఐ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ సాయి పాల్గొన్నారు.

వంగర: మండలంలో గ్రీవెన్స్, రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల నుంచి వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించాలని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎస్.జోసెఫ్ ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన గురువారం తనిఖీ చేసి, రెవెన్యూ సదస్సుల ఫిర్యాదుల పరిష్కారంపై ఆరాతీశారు. మొత్తం 115 వినతుల్లో 104 పరిష్కరించామని తహసీల్దార్ డి.ధర్మరాజు వెల్లడించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు పలువురి ఎంపిక



రాజాం సిటీ: నేత్ర వైద్య తనిఖీలు చేస్తున్న సిబ్బంది

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామంలో సత్యసాయి మందిరం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 80 మంది రోగులకు శంకర్ ఫౌండేషన్ వైద్యులు తనిఖీలు నిర్వహించి, వివిధ అంధత్వ సమస్యలతో బాధపడుతున్న 30 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ సురేష్, క్యాంప్ కో–ఆర్డినేటర్ ఎం.సాయి తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: ప్రతి ఒక్కరూ 40 ఏళ్ల వయసు దాటిన తర్వాత కంటి పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని ఆదర్శనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి యు.కిరణ్‌కుమార్ సూచించారు. యూపీహెచ్‌సీ ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి వైద్యులచే ఉచిత నేత్రవైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్రమణ వ్యాధులైన చక్కెర, రక్తపోటు, క్యాన్సర్, ఆస్తమా, దృష్టి సమస్యలపై సమగ్ర సర్వే నిర్వహిస్తున్నామన్నారు. అంతకుముందు 11 మందిని శస్త్రచికిత్స కోసం రిఫర్ చేశారు.

సంక్షిప్తంగా...

5.5 లీటర్ల సారా స్వాధీనం

వంగర/బొబ్బిలి: మండలాల్లో పలుచోట్ల సారాబట్టీలపై పోలీసులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించి, 5.5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. వంగర మండలంలోని జేకేగుమ్మడలో రాజాం సీఐ జైభీమ్ ఆధ్వర్యంలో దాడులు చేపట్టిన ఎక్సైజ్ పోలీసులు 3.5 లీటర్ల సారా, బొబ్బిలి మండలంలోని కొయ్యకొండవలస గ్రామంలో చేసిన తనిఖీల్లో 2 లీటర్ల సారాను పోలీసులు పట్టుకున్నారు. ఆయా ఘటనలకు సంబంధించి, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి

బొబ్బిలి: స్థానిక గ్రోత్ సెంటర్ వద్ద రోడ్డు భద్రతా మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. జిల్లా ఉప రవాణా కమిషనర్ డి.మణికుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని తెలిపారు.

చిన్నారులకు ఆధార్‌కార్డు చేయించండి



ఆధార్ సేవలు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: చిన్నారులకు ఆధార్‌కార్డు చేయించుకోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని రాజయ్యపేట గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ సేవా కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. చిన్నారులకు ఆధార్ చేయిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

తాగునీటి సరఫరాను మెరుగుపరచాలి



వార్డు పర్యటనలో సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలో తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ప్రసాద్‌నగర్ కాలనీ, సాయిశర్వాణీ టౌన్‌షిప్, మారుతీనగర్ ప్రాంతాల్లో గురువారం పర్యటించిన ఆమె.. తడి, పొడిచెత్తల సేకరణ, తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల తదితర అంశాలపై సిబ్బందితో సమీక్షించి, పలు సూచనలు చేశారు. ప్రతీ వార్డు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, వేసవిలో తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వంగర: మండలంలోని అరసాడ గ్రామంలో తా గునీటి బోర్ల మరమ్మతులు గురువారం చేపట్టి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.